విలువలు

సి.ఎల్.ఎన్.శాస్త్రి

“రాధా! చూడు. కొంచెం తిను. రాధా నా మాట విను.” “లేవండి నేను పాపిష్టిదాన్ని. చేజేతులా చేసుకున్నాను. నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు”. రాధ వెక్కి వెక్కి ఏడుస్తోంది. “రాధా ఊరుకో. అయిపోయినదానికి ఏంచేస్తాం.

నాకాఫీసు టైమవుతోంది అమ్మా నేను వెడుతున్నాను. దానిచేస్త కాస్త తివి పించవే." "అలాగేరా నాయనా. ఊం ఏమిటో కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుందని".

స్కూలు బస్సు అప్పుడే వెడుతోంది. దానివేపు జాలిగా, బాధగా చూశాడు రామారావు. రామారావు సైకిలు తొక్కుతున్నాడు. కాని అతని ఆలోచనలు వెనక్కి వెళుతున్నాయి. రాధ అవును రాధకి తగినశాస్తి జరిగింది. కాని అది తనకుకూడా కదా ఏ వస్తువూ ఉన్నప్పుడు దాని విలువ తెలియదు.

అప్పుడే ఆరునెలలు గడిచాయి....

* * *

రామారావు ఆ ఊళ్ళో యుడిసిగా పనిచేస్తున్నాడు. రాధ అతని భార్య రాధ బి ఏ. వరకు చదువుకుంది. కాని ఆడదాని కుండవలసిన సౌశీల్యం, వినయం, అణకువ ఏ కోశానా లేవు. వాళ్ళకి బాబు, పాప ఇద్దరు పిల్లలు. పాపకి మూడేళ్ళు వచ్చాక రామారావు ఇంక పిల్లలు కలగకుండా ఆపరేషను చేయించుకున్నాడు. తను ఒక క్లర్కు అయినా పిల్లల భవిష్యత్తుకోసం, వాళ్ళని ఫీజులు ఎక్కువైనా కాన్వెంటులో చేర్పించాడు. బాబు, పాప చాలా చురుకయినవాళ్ళు. క్లాసులో ఎప్పుడు ఫస్టువస్తూ ఆటల్లో కూడా చురుగ్గా ఉండేవారు. బాబుకి పది పాపకు ఏడేళ్ళు బాబు అయిదు, పాప మూడు చదువుతున్నారు

"నానమ్మా, ఈవాళ మాకు స్కూల్లో కామిక్సు భాగవతం బుక్కు ఇచ్చారు అందులో కథలు చెప్పనా?" "నాకు ఇంగ్లీషు రాదురా నాయనా. అయినా భాగవతంలోదే కథ ఒకటి చెప్తానురండి" "నేను నానమ్మ ఒళ్ళో కూర్చుంటాను" "అబ్బా నేను ముందడిగాను నేనే" "పాప చిన్నదికదా బాబూ దాన్ని కూర్చో నియ్యి." సర్లే ఇద్దరూ కూర్చోండి వినండి కద్రువ, వినత అని ఇద్దరు అక్కచెల్లెళ్ళు ఉండేవారు. కద్రువ నాగులకు తల్లి. ఒకరోజు ఒక గుర్రాన్ని చూశారు. దాని తోక తెల్లగా ఉందని వినత, కాదు నల్లగా ఉందని కద్రువ వాదించుకున్నారు ఎవరు గెలిస్తే వాళ్ళు రెండో వాళ్ళకి దాస్యం చేయడానికి ఒప్పందం ఆరోజు గడిచిపోయింది మరురోజు దగ్గరకి వెళ్ళి చూడ్డానికి తన కొడుకుల్లో ఒక నాగుణ్ణి గుర్రం తోకకి చుట్టుకునేట్టు చేసి కద్రువ పందెం గెలుస్తుంది. వినత చేసేదిలేక పందెం ఓడిపోతుంది చివరకు గరుత్మంతుడు అమృతం తెచ్చి నాగులకిచ్చి తల్లి వినతను దాస్యం నుండి విముక్తురాల్ని చేస్తాడు. చూశారా? తల్లికోసం కొడుకు ఎంతో కష్టపడ్డాడన్నమాట." "చాలా బాగుంది నానమ్మా. అమ్మా చప్పను కొట్టకమ్మా. కొట్టకమ్మా." "ఎందుకే

వాణ్నలా కొడతావు. వాడేంచేశాడే తల్లీ?" "ఏంచేశాడా? తలుపు బార్లా పెట్టి ముసలమ్మ కథలు వింటున్నాడు పిల్లి పాలుకాస్తా తాగేసింది." "అమ్మా! కొట్టకమ్మా. ఇంకెప్పుడు అలా వదలనమ్మా." వెధవా, స్కూలునించి వచ్చాక పాలు తాగి తలుపేయమన్నానా?" "ఎందుకే వాణ్నలా చంపేస్తావేమిటే?" "మీరు అనవసరంగా కలగజేసుకోకండి. చచ్చినా బాగుణ్ణు పీడ విరగడవుతుంది. వెధవ పిల్లలు ప్రాణాలు తోడేస్తున్నారు."

* * *

"పాపా! అక్కడ గూట్లో అద్దం ఉంటుంది పట్రా అమ్మా. షేవింగు చేసుకోవాలి. పాప అద్దం తెస్తూ గడప తగిలి పడిపోయింది. అద్దం ముక్కలై పోయింది. రాధ వీక్లీ చదువుకుంటున్నది లేచి పాపని ఫెడీఫెడీ కొట్టింది. "గుంట ముండా. అద్దం తిన్నగా పట్టుకోలేవే." "రాధా! ఏమిటది? నీ ఆగడం రోజు రోజుకీ శృతిమించుతోంది. రాత్రికి రాత్రి బాబుని. అద్దం నేనే తెమ్మన్నాను. అసలు నువ్వు కన్న తల్లివేనా? రాక్షసివా?" "అవును లెండి నేను రాక్షసి లాగే కనబడతాను. మోజు తీరిపోయాక అంతే." అనవసరంగా నోరు జారకు. నువ్వు ఖాళీగానే కూర్చున్నావుగా. నువ్వు తేవచ్చుగా. పాపని తెమ్మని చెప్పినప్పుడు నువ్వూ విన్నావుగా పోనీలే పాపా ఏడవకు మరొకటి కొనుక్కుందాం" "అంతే లెండి మీ ముద్దుల కూతురు బద్దలు కొట్టిందిగా. నష్టమేమీ లేదు" "మరేందిగులు పడకు నా సొమ్మేగా పోయింది. నేను కొనుక్కుంటానులే" "అంతేలెండి ఇదంతా మీ సొమ్మే. ఈ కుర్చీలు, బల్లలు ఆఖరికి నే కట్టుకున్న చీర, జాకెట్టుకూడా...." "ఛీ ఛీ నీతో వాదమేమిటి." "అవును లెండి, నోరు కుట్టేసుకోండి." రామారావు ఇంక వినలేక నిష్క్రమించాడు.

"బాబూ, పాపా తయారయ్యారా?" "మేము రెడీ డాడీ." "గుడ్ రండి బస్సుటైము అయింది." "బాబూ, పాపా జాగ్రత్తగా వెళ్ళండి. ఇంటర్వెల్‌లో ఆడకండి క్లాసులోనే కూర్చోండి. మళ్ళీ సాయంత్రం బస్సు జాగ్రత్తగా ఎక్కండి." "అలాగే డాడీ. వస్తాం డాడీ టాటా." రామారావు వాళ్ళని బస్సు ఎక్కించి ఆఫీసుకి సైకిలుమీద బయలు దేరాడు.

* * *

"అమ్మ మంచిది కాదేం. డాడీ మంచి వారు. నానమ్మకూడా మంచిదే నానమ్మ మంచి మంచి కథలు చెప్తుంది. డాడీ అసలు కోపమే తెచ్చుకోరు. ఏమైనా పాడుచేసినా కూడా ఏమీఅనరు. అమ్మ అస్తమానం కొడుతుంది" "అవునన్నయ్యా అమ్మ రాక్షసి, దయ్యం భూతం డాడీ దేముడు" అటుగా వస్తున్న



రామారావు వాళ్ళ మాటలు విన్నాడు. "బాబూ పాపా! ఇలా రండి. తప్పమ్మా అమ్మని అలా అనొచ్చా?" "మరెందుకు అస్తమానం కొడుతుంది?" "ఇంక కొట్టకుండా నేను చెప్తానమ్మా." "ఛీ నువ్వెప్పుడూ అబద్ధాలు చెప్తావు. ఇలాగే చాలా సార్లు అన్నావు. కాని అమ్మ ప్రతిసారీ కొడుతోంది." రామారావు మౌనంగా ఉండిపోయాడు.

"నానమ్మా పడుకున్నావేం?" "కొంచెం నడుము నొప్పిగా ఉంది నాయనా." "నేను రాయనా నాయనమ్మా." "వద్దు నాయనా. నా బంగారు తండ్రే. ఆ మాటచాలు. మీ అమ్మ చూస్తే కోప్పడుతుంది" "ఫర్వాలేదు నానమ్మా. ఏది అటు తిరుగు నేను రాస్తాను." రాధ ఇవన్నీ దూరంనించి వింటోంది. కాసేపు పోయాక సుడిగాలిలా వచ్చి బాబుని బరబరా ఈడ్చుకుపోయి వీపుమీద గుద్దేసింది. "అమ్మా! అమ్మా! కొట్టకమ్మా. నానమ్మకి నడుంనొప్పిగా ఉంటేను." "వెధవా! నానమ్మ మీద ప్రేమ పండిపోతోంది. ముసలి ముండకి సేవ. నేను తలనొప్పితో అల్లా గింజుకుంటుంటే కాస్త అమృతాంజనం రాస్తానన్న ముక్క లేదు." "వాడి తప్పేమిటమ్మా రాధా? ఎందుకు పిల్లవెధవని అలా కొడతావు నేను వద్దనే అన్నాను. అయినా పిల్లాడు ప్రేమ చంపుకోలేక." "అబ్బో మహాలావు ప్రేమ నానమ్మ మీద ప్రేమ." "అవునమ్మా ప్రేమే. ప్రేమ గురించి నీకేం తెలుసు? ప్రేమ ఇస్తే ప్రేమ పుడుతుంది." "చాల్లెండి నీతులు. అయినా నా కొడుకుని నేను ఇష్టం వచ్చినట్టు చేసుకుంటాను. మధ్య మీరెవరు కలుగజేసుకోవటానికి?" "అవునులే తల్లి. నువు చెప్పినదే నిజం."

ఆవాళ రాత్రి భోజనాల టైము. "అన్నయ్యా నన్ను ముట్టుకో. నేను దాంకుంటాను." "ఆ పాపా దొరికావు"

"నేను దొరకనుగా" అంటూ పాప వంటింటి వేపు పరిగెట్టింది. అటు వేపు నించి రాధ మజ్జిగ తెస్తూంటే పాపతల్లిని గుద్దుకుంది. మజ్జిగ నేలపాలయింది. రాధ శివమెత్తింది.

"వెధవల్లారా ప్రాణాలు తోడేస్తున్నారు. మీరు పిల్లలా పిశాచాలా" అంటూ ఇద్దర్నీ బాదేసింది. "కొట్టకు మమ్మీ. ఇంకెప్పుడూ అల్లరి చేయం మమ్మీ" అంటూ పిల్లలు గోలగోలగా ఏడిచారు రామారావు వచ్చి రాధని వారించాడు. "అవునులెండి. నేను చెడ్డదాన్ని. పిల్లల్ని పెంచడం తెలియదు. ఇప్పుడు అన్నం మింగుతారా. మజ్జిగ లేకుండా మింగండి" అంటూ విసవిసా వెళ్ళి పడుకుంది.

* * *

అవి ఆఫీసులో ఇనస్పెక్షను రోజులు. రామారావు ఉదయమే ఆరు గంటలకే లేచి గబ గబా తయారయి ఆఫీసుకివెళ్ళిపోతున్నారు. మళ్ళా రాత్రి పది గంటలకి వస్తున్నాడు. బాబుని, పాపని గురించి అసలు పట్టించుకుందుకే టైము లేదు. రామారావు వచ్చేసరికి పడుకుండి పోతున్నారు వాళ్ళు లేచేసరికి తను వెళ్ళిపోతున్నాడు. ఏమీ గొడవ జరగటం లేదనే భావిస్తున్నాడు.

ఆ రోజు బాబు పాప స్కూలు నించి ఇంటికి వచ్చారు. బాబు స్కూల్లో టిఫినుబాక్సు పారేశాడు. బాక్సు క్లాసులో పెట్టి, పి. టి. అవరులో గ్రౌండ్స్‌లోకి వెడితే, ఎవరో కొట్టేశారు. అదే చెప్పాడు. "వెధవా. మనమేమైనా జమీందార్లు మనుకున్నావా? రోజుకో వస్తువు తగలేస్తారు మిమ్మల్ని బయటకి పంపించడం భయం. ఉండు నీకిలా కాదు. ఎన్ని తన్నినా బుద్ధిరావటంలేదు" అంటూ గరిట కాల్చి వాతలు పెట్టింది. బాబు అమ్మో అమ్మో అంటూ గుక్కతిప్పుకోకుండా ఏడ్చేశాడు. అడ్డుకోబోయిన నానమ్మని తోసేసింది రాధ. పాప కూడా బాబుని చూసి ఏడ్చేసింది. నానమ్మ బాబుని ప్రక్కనే ఉన్న డాక్టరుగారి దగ్గరికి తీసికెళ్ళి కాస్త మందు రాయించింది. ఆ రాత్రి నానమ్మ దగ్గరే ఇద్దరూ పడుకున్నారు

మరునాడు ఉదయమే బాబు లేవలేక లేచాడు. రాత్రి జరిగింది గుర్తుకొచ్చింది. రాధ పిల్లలకి టిఫిను చేయలేదు. బాక్సు పారేసినందుకు శిక్ష "మాడండి వెధవల్లారా. నీతోపాటు అది కూడానూ" అంది రామారావు ఉదయమే వెళ్ళిపోయాడు లంచ్ అవరులో బాబు, పాప ప్లేగ్రౌండులో కలుసుకున్నారు. రోజూ కలిసి టిఫిను తినేవాళ్ళు అవాళ బాగా ఆకలేస్తోంది. "అన్నయ్యా కిషోరు అక్కడ కూర్చుని తింటున్నాడు. కొంచెం అడుగుదామా?" "తప్పు. డాడీ ఏం చెప్పారు? ఎవర్ని అడగకూడదనలేదు. దా మనం ఆట ఆడుకుందాం.

చూడు ఆ నూతిదగ్గిర సింహం, కుందేలు ఆట ఆడుదాం. నువ్వు కుందేలు, నేను సింహం. నువ్వు అనాలి మహరాజా, మీలాంటి సింహమే నూతిలో దాంకు నుంది అని" పాప అడిగింది. బాబు "ఏదీ ఎక్కడా?" అని గర్జించాడు. పాప విరగబడి నవ్వింది "అన్నయ్యా ఇంకోసారి అను" అంది పాప. బాబు గర్జించాడు. పాప మళ్ళీ నవ్వింది. ఇద్దరూ నూతిలోకి తొంగి చూస్తున్నారు. అది కొంచెం పాత నుయ్యి అవడం వల్ల వాళ్ళు అనుకున్న, నూతిగోడ లోపలికి పడిపోయింది. దాంతో పాటు పాప "అన్నయ్యా" అని అరుస్తూ పడిపోయింది. వెంటనే "పాపా" అంటూ పట్టుకోబోయి బాబు. అంతే దూరంగా ఉన్న పిల్లలు ఇది చూసి హాహాకారాలు చేశారు ప్రిన్సిపాలుతో చెప్పారు.

రామారావు ఇనస్పెక్షను రికార్డులన్నీ పూర్తయ్యాయి. బాస్ ఎంతో మెచ్చుకున్నారు ఇంతట్లో ఫోను వచ్చింది "మీరు వెంటనే ఒకసారి స్కూలుకి రావాలి" ప్రిన్సిపాలు కంఠం. "ఏం జరిగింది మేడం?" ఆతృతగా ప్రశ్నించాడు రామారావు. ఇక్కడికి వస్తే చెబుతాము. వెంటనే రండి" అని ఫోను పెట్టేసింది మేడమ్

రామారావు వెళ్ళేసరికి బాబు, పాప ఒక బల్లమీద పడుకోబెట్టబడి ఉన్నారు. నిర్జీవంగా మిగిలారు. అయినా మొహాలు నవ్వుతూ కళగా ఉన్నాయి. అప్పటికే నీళ్ళు ఎక్కువగా త్రాగడం వల్ల, చిన్న పిల్లలు కావడం వల్ల వెంటనే బయటకు తీసినా లాభం లేకపోయింది. మేడమ్ జరిగిందంతా వివరిస్తున్నారు రామారావు కన్నులు అశ్రువులు వర్షిస్తున్నాయి. అయినా మగవాడు కనుక ధైర్యం కూడ గట్టుకున్నాడు స్కూలుకి ఆ పూట, మరో రోజు శలవు ప్రకటించారు. తోటి పిల్లలు కూడా ఏడుస్తున్నారు. అందరి సాయంతో రామారావు టాక్సీలో వాళ్ళని ఇంటికి తీసుకువచ్చాడు.

"రాధా! ఇప్పుడు నీ కడుపు మంట చల్లారిందా? చావండి చావండి అని శపించావు. కన్నతల్లివి. అదిగో చూడు. నీ కోర్కె తీరింది. మరెప్పుడూ నీకు అడ్డురారులే. ఏ పనీ, ఏ వస్తువూ పాడు చెయ్యరులే." రాధ ఒక్కసారి విశ్చేష్ట అయ్యింది. ఇలా జరుగుతుందని తను అనుకోలేదు. తరువాత వాళ్ళమీద పడి రోదించింది. బరియల్ గ్రౌండుకి స్కూలు స్కూలంతా తరలి వచ్చింది పిల్లలంతా కలసి బాబు, పాపల ఆత్మ శాంతికి ప్రేయర్సు జరిపారు. వాళ్ళమీద పూలమాలలు కురిపించారు. అప్పటితో స్కూలుకి తనకి ఋణం తీరిపోయింది.

గతం ఆలోచిస్తూ రామారావు అప్పుడే ఆఫీసుకి చేరుకున్నాడు. నిర్లిప్తంగా సీటులో కూర్చున్నాడు. మోడు వారిన జీవితాన్ని భారంగా లాగడానికి.